

చంద్రబాబు వేషధారణలో ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వేషధారణలో ఆచంట చిన్నపేటకు చెందిన అంద్రు లక్ష్మణరావు సైకిల్‌పై టిడిపి జెండాలు కట్టుకుని వెనకవైపు టిడిపి మేనిఫెస్టో ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసుకుని ఊరంతా తిరుగుతూ విక్టరీ సింబల్ చూపిస్తూ ప్రచారం చేపట్టారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ టిడిపి హామీ ఇస్తున్న పథకాలు సైకిల్‌పై ప్రచారం చేపట్టినట్లు ఆయన తెలిపారు.



చంద్రబాబు వేషధారణలో వ్యక్తి

పశ్చిమ ప్రజలు పునరాలోచించాలి

- రానున్న ఎన్నికల్లో టిడిపికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలి
- టిడిపి, జనసేన కూటమి అధికారంతో జిల్లా అభివృద్ధి
- ఇక్కడ అసమర్థ మంత్రులు, ఎంఎల్‌ఎలు రాజ్యమేలుతున్నారు
- అయోధ్యలంక వంతెన, ఆక్వా యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్‌లను పూర్తిచేస్తాం
- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు


సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - భీమవరం/ఆచంట

'చల్లని సాయంత్రం, ఆహ్లాదకరమైన వాతావరణం.. ఎటు చూసినా పచ్చని పొలాలు దేశానికి అన్నంపెట్టిన అన్నపూర్ణ పశ్చిమగోదావరి జిల్లా అని, ఈ జిల్లా అంటే తనకు ఎనలేని అభిమానమని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. 2014 ఎన్నికల్లో 15 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాలు టిడిపికి ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో టిడిపికి పూర్వ వైభవాన్ని మళ్లీ తీసుకొచ్చేందుకు పశ్చిమ ప్రజలు పునరాలోచించాలని కోరారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆచంటలో నక్కల కాలువ సమీపాన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షతన 'రా.. కదలిరా' బహిరంగ సభను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చంద్రబాబు సాయంత్రం 4.05 గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన బయలుదేరారు. రామేశ్వరస్వామిని దర్శించుకుని సభా ప్రాంగణానికి 5.19 నిమిషాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా చంద్రబాబు మాట్లాడారు. మంచికి, అతిథి మర్యాదలకు మారు పేరు పశ్చిమ జిల్లా అని అన్నారు. ఆచంట నుంచే జై విజయయాత్ర ప్రారంభిస్తున్నామని చెప్పారు. టిడిపియే కాకుండా జనసేన అంటే కూడా ఈ జిల్లాలో అభిమానం ఎంతో ఉందన్నారు. వైసిపి సినిమా అయిపోయిందని, త్వరలో వారంతా బయటకు పోతారన్నారు. జిల్లాలో ఏ ఒక్క రోడ్డూ నిర్మించలేదని, కాలువలు, డ్రెయినేజీల పూడిక తీయలేదన్నారు. వ్యవసాయాన్ని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. వరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. తుపాన్ సంభవించిన సమయంలో జిల్లాలో నాలుగు రోజులు పర్యటించానని గుర్తు చేశారు. రైతులకు, కౌలు రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలుకు కనీసం గోనె సంచులు కూడా ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. దిక్కుతోచని స్థితిలో రైతులు క్రాప్ హాలీడే ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రైతు రాజ్యం తీసుకొస్తామన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి నదులను అనుసంధానం చేసి మూడు పంటలకు నీరు అందిస్తామన్నారు. ఆక్వా రంగాన్ని కుదేలు చేశారన్నారు. తమ హయాంలో రెండు లక్షల ఎకరాలు సాగు పెంచితే వైసిపి సాగు ఖర్చు మూడు రెట్లు చేసిందని, ఫీడ్, సీడ్ ధరలు అధికంగా పెంచిందన్నారు. ఆక్వా యూనివర్శిటీ, మెడికల్ కళాశాల, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను వైసిపి పెండింగ్‌లో పెట్టిందని, వీటిని అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. అయోధ్యలంక వంతెన నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మార్టేరు, కోడేరు నుంచి పి.గన్నవరం వెళ్లేందుకు వంతెన అనుసంధానం చేస్తామన్నారు. వరి రైతులు, కౌలు రైతులు, అన్ని వర్గాల ప్రజలు 90 రోజులు కష్టపడితే స్వర్ణయుగం తీసుకొస్తానని చెప్పారు.


చంద్రబాబుకు గజమాల వేస్తున్న పితాని, నేతలు

జిల్లాలో అసమర్థ మంత్రులు, ఎంఎల్‌ఎలు

జిల్లాలో వైసిపికి చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు అసమర్థులని, వారి సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల కష్టాలు పట్టవని చంద్రబాబు విమర్శించారు. తణుకులో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఉన్నారని, సొంత జిల్లాలోనే రైతులకు ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు ఇవ్వని అసమర్థ మంత్రి అన్నారు. రాష్ట్రంలోని టిడిఆర్ బాండ్ల కుంభకోణం తణుకు నుంచే జరిగిందని, దీనిని రాష్ట్రమంతా వైసిపి అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఏది నిర్మించాలన్నా ఐదు శాతం కమీషన్ ఇవ్వాలని ఆ మంత్రి నిబంధన విధించారన్నారు. తాడేపల్లిగూడేనికి చెందిన మరొక మంత్రి కొట్టు సత్యనారాయణ ఏకంగా చిల్లర కొట్టే పెట్టారన్నారు. అన్నిచోట్లా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. భీమవరంలో గజదొంగ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అని, రూ.52 కోట్లు అవినీతి చేశారన్నారు. సొంతంగా ప్యాలెస్‌ను నిర్మించుకుంటున్నారని, పేదలకు మాత్రం ఇళ్లు కట్టించే పరిస్థితి లేదన్నారు. నరసాపురం ఎంఎల్‌ఎ ప్రసాదరాజు నియోజకవర్గంలో అవినీతిని ప్రసాదంలా ఆరగిస్తున్నారని విమర్శించారు. తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి లేఅవుట్ రూపంలో ఎక్కువ ధరలకు అమ్ముకున్నారన్నారు. గతేడాది ఏటిగట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.15 కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఈ బహిరంగ సభలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, నేతలు ఎంఎ షరీఫ్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మండివరపు రవికుమార్, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, వేటుకూరి వెంకటశివరామరాజు, గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రులు కెఎస్.జవహర్, పీతల సుజాత, జనసేన జిల్లా అధ్యక్షులు గోవిందరావు, నేతలు బొమ్మిడి నాయకర్, జుత్తిగ నాగరాజు, చేగొండి సూర్యప్రకాష్, బొలిశెట్టి శ్రీనివాస్, విడివాడ రామచంద్రరావు పాల్గొన్నారు.

అవినీతి మహారాజు ఎంఎల్‌ఎ రంగనాథరాజు
పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని

వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని ఆచంట మాజీ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ వ్యాఖ్యనించారు. టిడిపి, జనసేన కలిసి ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నాయని చెప్పారు. ప్రజల కోసం పోరాడుతున్న చంద్రబాబుపై అడ్డగోలుగా కేసులు బనాయించి జైలుకు పంపిన ఘనుడు జగన్ అని విమర్శించారు. ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియాతో వైసిపి దోపిడీ చేస్తుందన్నారు. స్థానికంగా ఉన్న ఎంఎల్‌ఎ రంగనాథరాజు సభావేదికకు స్థలం ఇవ్వకుండా అడ్డగించి విజిలెన్స్ అధికారులను పంపించారన్నారు. అలాగే గెస్ట్‌హౌస్ కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. నియోజకవర్గంలో 48 గ్రామాల్లో జరిగిన ఇళ్ల స్థలాల పంపిణీలో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అక్రమంగా వసూలుకు పాల్పడి సుమారు రూ.21 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. రైతుల నుంచి రైస్‌మిల్లర్ల నుంచి రూ.13 నుంచి రూ.19 కోట్లు దండుకున్నారన్నారు. భారతీయ విద్యాభవన్స్‌కు సంబంధించినవారికి తెలియకుండా తప్పుడు అఫిడవిట్లు సృష్టించి అవినీతికి పాల్పడ్డారన్నారు. ఎఎస్‌పి భీమారావు, నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


ఎస్ఎస్ఎ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎస్ నాయకులు

19వ రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎస్ జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం 19వ రోజు సమ్మె శిబిరం వద్దకొచ్చి ఉద్యోగులకు నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష జెఎసి జిల్లా కమిటీ నాయకులు వాసు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. తమవి గొంతెమ్మ కోర్కెలు కాదన్నారు. ఉద్యోగుల ఆవేదనను ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంతోషి, ఉద్యోగులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రూ.42.80 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ల అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో పైపులైన్లు నిర్మించి 30 సంవత్సరాలు పైబడి శిథిలావస్థకు చేరాయని, ఈ నేపథ్యంలో పైపులైన్లు మారుస్తున్నామని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకు, దానికి కావాల్సిన కొత్త పైపులైన్‌కు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని ముత్యాలపల్లిలో 60 వేల లీటర్ల తాగునీటి ట్యాంకును ప్రారంభించామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వం ఆలోచనని తెలిపారు. గ్రామంలోని గదల్లవంపు, చింతరేవు, ముత్యాలపల్లి, ఎస్‌సి కాలనీలో రూ.43 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణంతోపాటు 600 కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్ ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. నియోజకవర్గంలో రూ.65 కోట్లతో చేపట్టడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం 45 గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా పనులు మొదలు పెట్టగా, కొన్ని పనులు పూర్తయ్యాయని, కొన్ని పనులు జరుగుతున్నాయని, కొన్నింటికి టెండర్లు పిలిచామని తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్‌లోపు పనులన్నీ పూర్తి చేసి ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళికతో శాశ్వత పనులను చేసి ప్రతి గ్రామానికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. ముత్యాలపల్లిలో రూ.70 లక్షలు రూపాయలు ఇంటర్నల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయగా రూ.30 లక్షలతో రోడ్లు నిర్మించామన్నారు. మిగతా రూ.40 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, సర్పంచి కొప్పనాతి పల్లయ్య, నాయకులు కర్రి ఏసు, రేవు రాంబాబు, పొన్నమండ సూరయ్య, కొల్లాటి సోమరాజు, కొల్లాటి రామారావు, కొల్లాటి నాగరాజు, మైల నాగరాజు, కడలి నాగరాజు, బొక్క పెద్దిరాజు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగించినా బెదరం


తణుకులో జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

27వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
జిఒ 2 ప్రతుల దహనం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సాగర మథనం జరిగేటప్పుడు ముందు విషం వచ్చింది తరువాత అమృతం వచ్చిందని, ఈ పోరాటంలో కూడా విషం లాంటి ఎస్మాను ప్రయోగించారు తరువాత సమస్యలు పరిష్కరించడం తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆదివారం 27వ రోజు సమ్మె నేపథ్యంలో అంగన్‌వాడీలు ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటానికి భయపడి సంబంధం లేని చట్టాన్ని రుద్దుతూ నిర్బంధాన్ని ప్రయోగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి మాట్లాడారు.సమ్మెకు ఫ్లాట్ రిక్షా వర్కర్స్ యూనియన్ కార్మికులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.కళ్యాణి, తులసి, లక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెలో భాగంగా 24 గంటల రిలే నిరాహార దీక్షలను రెండో రోజు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి జి.గోపీమూర్తి ప్రారంభించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె ప్రభుత్వ ఆగడాలను బట్టబయలు చేస్తోందన్నారు. యుటిఎఫ్ నాయకులు కనకదుర్గ మాట్లాడారు. దీక్షలో కె.తులసి, పి.నాగరత్నం, ఎ.లక్ష్మి, మణి, కనకమహాలక్ష్మి మాధవి, శాంతికుమారి, దుర్గ కూర్చున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ రామరాజు, రామభద్రం, పట్టాభి రామయ్య, సీతారామరాజు, సిఐటియు నాయకులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

పెంటపాడు : అంగన్వాడీల సమ్మె 27వ రోజుకు చేరింది. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 2 ఎస్మా కాపీలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, అంగన్వాడీ నాయకులు జై.శ్యామలాకుమారి, వి.కనకమహాలక్ష్మి మాట్లాడారు. వెంటనే జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.అనురాధ, జి.జయలక్ష్మి, సిహెచ్.శ్రీదేవి, హైమ, వెంకటలక్ష్మి, నాగమణి, శిరీష, మంగతాయారు పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చించినాడ జాతీయ రహదారిపై జిఒ 2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, ఎం.ఆంజనేయులు, టి.స్టాలిన్, పి.శ్రీనివాస్, జోషఫ్ రాజు, ఆనంద్‌రాజు, జున్ను పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే అంగన్వాడీ రిలే నిరాహార దీక్షలు 27వ రోజు కొనసాగాయి. ఈ దీక్షల్లో ఆయా సెక్టార్ నాయకులు సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతితో పాటు కార్యకర్తలు నాగమణి, రాణి సులోచన, లక్ష్మి కుమారి, సుజాత, విజయలక్ష్మి, ఆయాలు భాస్కరి, కుసుమకుమారి, నాగలక్ష్మి, అలివేలు, హైమావతి, రామలక్ష్మి కూర్చున్నారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు సంఘీభావం తెలిపారు.

పోడూరు : జిఒ 2ను రద్దు చేయాలని అంగన్వాడీ మండల కార్యదర్శి జె.ఉమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరం వద్ద జిఒ కాపీని దహనం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు పి.రాజామణి, ఆర్.కుమారి, ఆర్.అనసూయ, ఎస్.భాగ్యలక్ష్మి, ఎ.భవాని, డి.భాగ్యలక్ష్మి, సిఐటియు నాయకులు పిల్లి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్వాడీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐద్వా మండల నాయకులు సందక ఉదయ కుమారి భరోసా ఇచ్చారు. అంగన్వాడీల సమ్మె 27వ రోజు కొనసాగింది. ఐద్వా సభ్యులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి మాట్లాడారు. అనంతరం ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు లావణ్య, కళ్యాణి, బత్తెన పార్వతి, కె.విజయ లావణ్య, కృష్ణవేణి, భవాని, సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, అంగన్వాడీల నాయకులు కృష్ణకుమారి, సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : 27 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎస్మా జిఒలకు అంగన్వాడీలు భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, పురుషోత్తం, అంగన్వాడీ నేతలు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం జగన్ నియంతృత్వానికి నిదర్శనమని సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జనసేన నాయకులు అనుకుల రమేష్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. సమ్మెలో భాగంగా 27వ రోజు ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ గార రంగారావు, బి.వసంతకుమారి, ఎం.మణి మాలతి, వి.ప్రమీల, ఆర్.లీలా నాగవేణి, టి.సుభద్రాదేవి, ఆర్.కనకదుర్గ, మంగతాయారు, బి.వరలక్ష్మి, ఎల్.లలిత, పి.భువనేశ్వరి పాల్గొన్నారు.

గణపవరం : అంగన్‌వాడీల సమ్మె 27 రోజు కొనసాగింది. అయితే ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి.సత్యవతి, చంద్రకళ, భవానీ, సత్యవాణి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : పౌష్టికాహారం అందించే అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. 27వ రోజు దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అనంతరం జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆదూరి సాంబమూర్తి, అంగన్వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.



భీమవరంలో..

ఉండి : అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించి సమ్మెను అణచివేయాలని చూడడం రాష్ట్ర ప్రభుత్వ దురహంకార చర్యకు నిదర్శనమని అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సత్యవేణి అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడారు.అనంతరం జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఝాన్సీ, సూర్యకుమారి, గొల్లమ్మ, జయలలిత, చిట్టి మరియ, వెంకటలక్ష్మి, లలిత పాల్గొన్నారు. సమ్మెకు సిఐటియు మండల అధ్యక్షులు డి.శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

పెనుగొండ : మండలంలో అంగన్‌వాడీల సమ్మె 27వ రోజు కొనసాగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 2ను రద్దు చేయాలని, ఈ బెదిరింపులకు ఎవరూ భయపడొద్దని నేతలు తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నేతలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ ప్రసంగించారు. అంగన్‌వాడీలను అణచివేయాలనే ఉద్దేశంతో ఎస్మా జిఒను ప్రభుత్వం ముందుకు తెచ్చిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము పాల్గొన్నారు.

పాలకోడేరు : ఎస్మా చట్టంతో అంగన్వాడీల సమ్మెను ఆపలేరని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. అంగన్వాడీల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎస్మా చట్టం జిఒ కాపీలను అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పడవలు చేసి కాలువలో వదిలి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అశ్రీయ, విజయలక్ష్మి, విమల, సోని, మంగతాయారు, విమల కుమారి, నాగలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చెరువులో పడవలు వదులుతున్న అంగన్‌వాడీలు


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన డిఇఒ

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి : డిఇఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సైన్స్‌ను ప్రోత్సహించాలని, సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ ఉపాధ్యాయులను కోరారు. విష్ణు స్కూల్లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను విజయనగరం ప్రాంతంలో పనిచేశానని, అక్కడ చేతబడి, చిల్లంగి వంటి మూఢనమ్మకాలు ఉండేవని, వాటిపై జన విజ్ఞాన వేదిక ప్రచారం చేయడం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిందని తెలిపారు. వీధి నాటకాలను సైతం జన విజ్ఞాన వేదిక ప్రదర్శించేదన్నారు. జిల్లాలో జన విజ్ఞాన వేదిక సైన్స్ పోటీలను నిర్వహించడం, సైన్స్‌పై ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. విద్యాదాత, బాంబే స్వీట్స్ అధినేత బాపిరాజును ఆయన అభినందించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన పలువురికి జ్ఞాపికలు అందజేశారు. ఉప విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ పోటీలో పాల్గొన్నవారు తమకు బహుమతులు, ర్యాంకులు రాలేదని నిరుత్సాహానికి గురికావొద్దన్నారు. పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం, విజ్ఞానం పెరుగుతాయన్నారు. ఎంఇఒ వేంద్ర వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, మాట్లాడుతూ సైన్స్‌పై అవగాహన కల్పించడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతున్నారు. సీనియర్ నాయకులు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి జెవివి దశాబ్దాలుగా కృషి చేస్తోందన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత సివి.రామన్‌ను స్ఫూర్తిగా తీసుకుని జెవివి ఆవిర్భవించిందన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త ఎల్లా ప్రగడ సుబ్బారావు జన్మించిన భీమవరంలో చెకుముకి జిల్లాసాయి సైన్స్ సంబరాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎల్లా ప్రగడ సుబ్బారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యదర్శి జామాను లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రగతి కోసం, స్వావలంబన కోసం జెవివి పనిచేస్తోందన్నారు. కన్వీనర్ రేపాక వెంకన్న బాబు అతిథులను ఆహ్వానించి మాట్లాడారు. కోశాధికారి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ 250 స్కూల్స్‌కు సంబంధించి 14,000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. పొత్తూరి బాపిరాజు మాట్లాడుతూ విద్యాదానం మహాదానం అన్నారు. దంగేటి గోపాలకృష్ణ గోర్కి, సుకుమార్ మాట్లాడారు. బహుమతులు ప్రధానం సందర్భంగా శాస్త్రవేత్తలు ఎలా ప్రగడ సుబ్బారావు ,ఎమ్మెస్ స్వామినాథన్, జెవివి నాయకురాలు సత్యవతి, సత్యానారాయణమ్మ, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా గౌరవాధ్యక్షులు కెపిఎస్ఎన్.వర్మ పతాకావిష్కరణ చేశారు. జిల్లా కార్యదర్శి అలుగు జాన్సన్ వందన సమర్పణ చేశారు. అధ్యక్షులు చింతపల్లి ప్రసాద్, విష్ణు పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.సత్యమూర్తి, టి.వెంకటేశ్వరరావు, సిహెచ్ ఉదయ్ కిరణ్, పి.హరికృష్ణ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 34 టీముల్లో ప్రథమ స్థానంలో రెండు టీములు నిలిచాయి. యలమంచిలి మండలం మట్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.మాధురి దీక్ష, ఎఆర్.లక్ష్మి, జి.మీనాక్షి, పాలకొల్లు భారతీయ విద్యా భవన్‌కు చెందిన విద్యార్థులు జి.తేజస్వి, ఎం.తన్మయ్య, రిషిత్ విజేతలుగా నిలిచారు. విజయం సాధించిన ఆయా విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో పల్నాడులోని చిలకలూరిపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొనున్నారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించిన వారికి కూడా సర్టిఫికెట్లు అందజేశారు.



పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఎస్‌విజిహెచ్ ఆడిటోరియంలో 1983 - 84లో పదో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. సత్తి భాస్కర్‌రెడ్డి, గోపాలకృష్ణ, రామచంద్రరావు, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిమాస్టర్, డివివి ఆచార్యులు, ప్రసాద్, ఆర్.రామకృష్ణరాజులను పూలమాలలో పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, రావుల వెంకటేశ్వరరావు, ద్వారంపూడి వీరెడ్డి, రమేష్‌రెడ్డి, చర్ల జనార్దన్‌రెడ్డి, హనుమాన్, ఇందుకూరి శ్రీనివాసరాజు, కుడుపూడి సూర్య, రాజమండ్రి రూరల్ సిఐ కోణాల నాగమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కోదండ రామిరెడ్డి, చర్ల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫ్రీజర్ బాక్స్ అందిస్తున్న సత్యనారాయణరెడ్డి, అన్నపూర్ణ దంపతుల కుటుంబీకులు

ఫ్రీజర్ అందజేత

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

కీర్తిశేషులు పులగం సత్యనారాయణ రెడ్డి, అన్నపూర్ణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మార్టేరు మానవత శాఖకు ఆదివారం ఫ్రీజర్ బాక్స్ అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానవ సేవే మాధవ సేవ అని దాతృత్వం చాటుకోవాలన్నారు. మానవత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఛైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, కమిటీ సభ్యులు కడలి సుబ్రహ్మణ్యం, పడాల రామచంద్రారెడ్డి, దొంగ జయ దుర్గారావు, చదువుల నరేంద్ర, దాత పులగం రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఛాంబర్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ఛాంబర్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌టెస్ట్-2024 నిర్వహించారు. ఈ టెస్టుకు జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 1935 మంది విద్యార్థులు హాజరై విశేష స్పందన కనబరిచారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జి హాజరయ్యారు. టెస్ట్ ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల్లో నిమ్మిడీకృతమైన పాఠ్యాంశాల ప్రతిభా పాటవాలను వెలికి తీయటానికి ఇటువంటి పోటీ పరీక్షలు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. లాభాపేక్ష లేని అత్యున్నత విద్యను అందిస్తూ పాలకొల్లు చుట్టుపక్కల ప్రాంత మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థులకు మంచి విద్యను అందిస్తోందని చెప్పారు. ఈ 2024కు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీని అభినందించారు. ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు మాట్లాడుతూ రూ.రెండు కోట్లతో నిర్మించిన అత్యాధునిక వసతుల ఇంటర్ కొత్త భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. సెక్రటరీ కలిదిండి రామరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఓల్గా, కోశాధికారి జల్లూరి రామలింగేశ్వరరావు, గవర్నింగ్ బాడీ మెంబర్స్ ఇనుకొండ రంగారావు, అడబాల రమణ, దేవరపు లక్ష్మీనారాయణ, ఎస్.కామేశ్వరరావు, కనుమూరి సీతారామరాజు, రేపాక ప్రవీణ్ భాను పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహాశీల్దార్ సుందరరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోడిపందేలు, జూదం, మద్యం అమ్మకాలు నేరంగా పరిగణించనున్నట్లు తెలిపారు. గ్రామ కంఠం, వ్యవసాయ క్షేత్రం, జనవాసాల ప్రాంతాల్లో కోడిపందేల నిర్వహణ కోసం బరులు ఏర్పాటు చేయడం నిషేధమన్నారు. వీటిని అతిక్రమిస్తే చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాలన్నారు. వీటిని నివారించడానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తహాశీల్దార్, ఎస్ఐలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



బహుమతులు అందిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ బాబ్జి

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జి చెప్పారు. పాలకొల్లులో ఆయన గృహం సమీపంలో యునైటెడ్ కాపు క్లబ్ సారధ్యంలో ఆదివానం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో గతంలో 7500 భాషలు ఉండేవని, ప్రస్తుతం ఐదు వేల భాషలు ఉన్నాయని చెప్పారు. ఈ శతాబ్దం చివరకు మరో 500 బాషలు మరుగవుతాయని ప్రపంచ నివేదికలు చెబుతున్నాయన్నారు. దీనిలో తెలుగు ఉందని చెప్పారు. కాబట్టి తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నా తెలుగు మాట్లాడించి నేర్పాలని కోరారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షులు గాదె ఆంజనేయులు, కార్యదర్శి పశ్యావుల రవికుమార్, కోశాధికారి ఇనుకొండ శేషాద్రి, మాజీ అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, వంగా నరసింహారావు, అడబాల వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



భీమవరంలో...

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు సామరస్యంగా పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగడం సిగ్గు చేటని సిఐటియు, ఎఐటియుసి, మున్సిపల్ యూనియన్ నాయకులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం సర్వమతాల ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఎఐటియుసి పట్టణ కమిటీ నాయకులు సిహెచ్.రంగారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాని మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలిచి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయటం తగదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేలాపు శ్రీను, ఎన్.విశ్వనాథం, బంగారు కామాక్షి, నేలాపు ధనలక్ష్మి, ఆశీర్వాదం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



నరసాపురంలో...

నరసాపురం టౌన్ : నరసాపురంలో మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నెక్కంటి సుబ్బారావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని, చర్చలు సామరస్యంగా జరపాలని, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ నాయకులు నెక్కంటి క్రాంతికుమార్, ఆరేటి మృత్యుంజయరావు, సానాబోయిన ఫణిరాజు, ఎఐటియుసి కార్మికులు రత్తయ్య, గుమ్మడి శ్రీను, అమరావతి, బాబి, సుజాత పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఎస్ఆర్ పోలిశెట్టి

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐక్య ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, యుటిఎఫ్ పాలసీ రచయిత, అమరజీవి ఎస్ఆర్ పోలిశెట్టిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు పని చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అమరజీవి ఎస్ఆర్ పోలిశెట్టి 23వ వర్ధంతి సభను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగ పరిస్థితుల్లో పాఠశాలలను పటిష్ట పరుచుకునేందుకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. అదే సందర్భంలో ఉపాధ్యాయుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొనాలని, పోలిశెట్టి వంటి మహనీయుల త్యాగాలతో నిర్మితమైన ఈ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ఎస్ఆర్ పోలిశెట్టి కుమారుడు, కోడలు యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శులు పివి.నరసింహారావు, వి.కనకదుర్గ మాట్లాడుతూ పోలిశెట్టి సొంత కుటుంబం కంటే విస్తృతమైన ఉపాధ్యాయులు, సామాన్య ప్రజలు, ఉద్యోగులతో ఒక పెద్ద కుటుంబాన్ని ఏర్పరచుకుని ఆ కుటుంబాల ఉన్నతి కోసం పని చేశారని నివాళులర్పించారు. ఉక్కు క్రమశిక్షణతో ఉద్యమస్ఫూర్తితో పనిచేసి ఎందరో ద్వితీయ శ్రేణి నాయకులను తయారుచేసి ఉద్యమానికి అందించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.రామభద్రం మాట్లాడుతూ ఉద్యమాలకు ప్రాధాన్యతనిచ్చి ఉద్యమ విస్తరణకు, పటిష్టతకు ఎస్ఆర్ పోలిశెట్టి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన కృషి వల్ల ఇప్పటికీ పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోని ఒక పెద్ద ఉద్యమంగా కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ ఎస్ఆర్ పోలిశెట్టి చివరి నిమిషం వరకు ప్రజల సంక్షేమం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు, కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్, కెఎస్ సిహెచ్.సాయిరాం, డి.ఏసుబాబు, ఎం.శ్రీనుబాబు, సిహెచ్.కుమార్, బాబ్జి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, పిల్లి శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పోలిశెట్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పట్టుదల, కృషి @ విజయం

సూర్యప్రభకు పిహెచ్‌డి పట్టా
పలువురి అభినందనలు



పట్టా అందుకుంటున్న సూర్యప్రభ

ప్రజాశక్తి - కాళ్ల

నిరంతరం శ్రమిస్తే విజయం తప్పక వరిస్తుందని ఏ కవి అన్నారో కానీ.. చాలామంది విషయాల్లో అది నిజమౌతుంది. ఏదైనా సాధించాలంటే పట్టుదల, తపన, కోరిక ఉండాలే గానీ.. ఎంతటి విజయమైనా ముందుకు వచ్చి తీరాల్సిందే. అనుకున్నది సాధించాలంటే సంకల్పం తోడై ఉండాలి.

పేద కుటుంబం నుంచి సూర్యప్రభ ఎంతో పట్టుదలతో, కృషితో పిహెచ్‌డి పట్టా అందుకోవడం అంటే మామూలు విషయం కాదు. సాధారణంగా పిహెచ్‌డి పట్టా పొందడమంటే అంత సులువు కాదు. ఎంతో కష్టపడాలి, నిర్ణీత సమయానికి ప్రాజెక్టులు చేయాలి, గైడ్ చుట్టూ తిరగాలి, కేవలం అదే పనిమీద శ్రమిస్తున్నవారు సైతం తమ పిహెచ్‌డి పూర్తవ్వాలంటే ఎన్నో సంవత్సరాలు ఎదురు చూడాల్సి ఉంటుంది. అలాంటిది ఒక అధ్యాపకురాలు పిహెచ్‌డి పూర్తి చేసి ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం మారుమూల గ్రామమైన ప్రాతళ్లమెరకకు చెందిన దాకారపు సూర్యప్రభ సాధించిన విజయం ఇది.

పట్టుదలతో పిహెచ్‌డి

డి.సూర్యప్రభ ప్రాతళ్లమెరక గ్రామంలో సిబిసిఎన్‌సి పాఠశాలలో ప్రాథమిక విద్య, ఏలూరుపాడులో మాధ్యమిక విద్య, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో చదివి, పిహెచ్‌డి ఆంధ్రా యూనివర్సిటీలో చేశారు. ప్రాతళ్లమెరక గ్రామంలో దాకారపు ధర్మారావు, జయభారతి కుమార్తె దాకారపు సూర్యప్రభ గతేడాది డిసెంబర్ తొమ్మిదో తేదీన విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆంధ్రా యూనివర్సిటీ పిసి ప్రొఫెసర్ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పిహెచ్‌డి పట్టా అందుకున్నారు.

కల నెరవేరింది

దాకారపు సూర్యప్రభ, అధ్యాపకురాలు, ప్రాతళ్లమెరక

డిగ్రీ చదివే సమయంలో పిహెచ్‌డి చేయాలని మనసులో బలంగా ఏర్పడింది. ప్రస్తుతం పిహెచ్‌డి పట్టాను సాధించి కలను నెరవేర్చుకున్నాను. మంచిగా చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలనుకున్నాను. ప్రస్తుతం డిఎన్ఆర్ కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకురాలిగా పని చేస్తున్నాను.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ప్రతి ఏడాది ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించే సంక్రాంతి సంబరాలు ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో కార్యక్రమాల వివరాలను ఆయన వెల్లడించారు. పాలకొల్లుకు గుర్తింపు తెచ్చిన వాలీబాల్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చే ఉద్దేశంతోనే ఎంఎల్ఎ కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ తెలిపారు. మహిళలను ప్రోత్సహించేలా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎనిమిదో తేదీ ఉదయం 9 గంటలకు పాలకొల్లు పట్టణ స్థాయిలో శ్రీనివాస డీలక్స్ రోడ్డులో, 9న యలమంచిలి మండల స్థాయిలో జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో, 10న పాలకొల్లు మండల స్థాయిలో లంకలకోడేరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద, 11న మండల స్థాయిలో జిన్నూరు బోళ్ల ప్రసాద్ ఇంటి వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతిఒక్కరికీ బహుమతులు అందిస్తామని చెప్పారు. ఆయా పోటీల్లో ఎంపికైన పది మంది చొప్పున మొత్తంగా 40 మంది పాలకొల్లు నియోజకవర్గస్థాయిలో 14వ తేదీన బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో జరిగే సంక్రాంతి సంబరాల ముగింపులో ముగ్గుల పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. నియోజకవర్గస్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేల విలువైన టెలివిజన్, ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు విలువైన ఫ్రిజ్, తృతీయ బహుమతిగా రూ.6 వేల విలువైన గ్రైండర్‌తో పాటు 40 మందికి కన్సలేషన్ బహుమతులు ఇస్తామని వివరించారు. 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. 14వ తేదీ భోగి ముగింపు రోజున సంక్రాంతి పండుగ వైభవం కనిపించేలా బొమ్మల కొలువు, గంగిరెద్దులు, గ్రామ దేవత, పల్లె వాతావరణం, సంస్కృతిక కార్యక్రమాలు వంటివి జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి పరిశీలకులు పెచ్చేటి చంద్రమౌళి, జివి, పెచ్చేటి బాబు, పొట్నూరి అప్పన్న, బందెల భాస్కరరావు పాల్గొన్నారు.

9న టీచర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల తొమ్మిదో తేదీన తాడేపల్లిగూడెం కడకట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.మంజుల, రాష్ట్ర కార్యదర్శి బిఎ.సాల్మన్‌రాజు, ఎన్నికల పరిశీలకులుగా ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి.త్రినాధ్ హాజరవుతారని తెలిపారు. మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు ఈ సమావేశంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టిడిపి, జనసేన నేతలు

ప్రజాశక్తి - ఉండి

ఆచంట నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన రా కదలిరా కార్యక్రమానికి ఉండి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టిడిపి, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామరాజు, నాగరాజు మాట్లాడుతూ సిఎం జగన్ ఎంఎల్ఎలను మార్చడం కాదని, తామే ముఖ్యమంత్రిని మారుస్తామని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులు గెలుచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : ఆచంటలో రా కదిలి రా కార్యక్రమానికి టిడిపి, జనసేన నేతలు టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, యువ నాయకులు కొవ్వలి రామ్మోహన్ నాయుడు, జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా బైక్ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. అభివృద్ధిని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రంలో ఏ సమయంలో ఎన్నికలు వచ్చినా జనసేన, టిడిపి గెలుపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మానసిక ప్రశాంతతకు హరికథ

టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆస్థాన హరికథ కళాకారిణి కృష్ణకుమారి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతతకు హరికథ ఎంతో మంచిదని, ఎప్పటికీ హరికథకు ఆదరణ తగ్గదని తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆస్థాన హరికథ కళాకారిణి జంధ్యాల కృష్ణకుమారి అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో జరుగుతున్న 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలకు వచ్చిన కృష్ణకుమారిని సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ హరికథలో అన్నమాచార్య చరిత్ర, వెంకటేశ్వర వైభవంపై శిక్షణ తీసుకున్నానని, తరువాత 1983లో ఆస్థాన హరికథ కళాకారిణిగా స్వామివారికి సంకీర్తన సేవ చేసే భాగ్యం కలిగిందని చెప్పారు. 37 ఏళ్ల పాటు నిర్విరామంగా హరికథ కళాకారిణిగా చేస్తున్నానని, హరికథకు ప్రతిచోట విశేష ఆదరణ లభిస్తుందని చెప్పారు. హరికథలో మొదటి గురువు నారదుడు, తుంబురుడు అని, వారి సంకీర్తనలతో గానం చేసే వారన్నారు. తన చిన్నతనం నుంచే హరికథపై మక్కువ ఉండడంతో ఇంట్లో ప్రోత్సహించి నేర్పించారన్నారు. హరికథను 105 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధోత్సవాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వైభవ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనాలు

స్వచ్ఛత గాలికి
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల



కోపల్లె గ్రామ సచివాలయం వద్ద చెత్త సేకరణ రిక్షాలు

గ్రామాల్లో చెత్త సేకరణ అటకెక్కింది. పల్లెల్లో ఏ ఒక్కరోజు చెత్త సేకరణ చేపట్టకపోయినా పరిస్థితి దారుణంగా మారుతుంది. అందుకే ప్రభుత్వాలు లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీలకు చెత్త సేకరణ వాహనాలను సమకూర్చాయి. నిర్వహణ లోపాలకు తోడు అధికారుల అలసత్వం కారణంగా వీటిలో చాలావరకు మూలకు చేరాయి. మండలంలో 21 గ్రామ పంచాయతీలు, 21 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పది వరకు చెత్త సేకరణ రిక్షాలు మూలన పడి ఉన్నాయి. కోపల్లె, లక్ష్మీనరసింహపురం గ్రామ సచివాలయాల్లో పారిశుధ్య నిర్వహణకు కేటాయించిన వాహనాలు నిర్వహణ భారంతో మూలకు చేరాయి. ఇంటింటి చెత్త సేకరణ సజావుగా సాగడం లేదు. మరికొన్ని గ్రామాలైతే వాహనాలు లేక చెత్తను సమీప రహదారులు, పంట కాలువల వెంబడి వేసి నిప్పు పెడుతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారి ప్రజారోగ్యానికి హాని కలుగుతుంది. పాలకులు పట్టనట్లు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్త రిక్షా వాహనాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లక్ష్మీనరసింహపురం సచివాలయం వద్ద చెత్త సేకరణ రిక్షా

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

9, 10వ తేదీల్లో 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉద్యోగ, ఉపాధ్యాయుల రూ.18 వేల 96 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నెల 9, 10వ తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో జరిగే 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉండగా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు, మెరుగైన పిఆర్‌సి, టైం టు టైం డిఎ ఇస్తానని, సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తానని అనేక వరాల జల్లులు కురిపించారని తెలిపారు. ఎన్నికై ఐదేళ్లు పూర్తికావస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేరకపోగా పదో తేదీ దాటితే గాని జీతాలు రాని పరిస్థితి ఉందన్నారు. ఐదేళ్లలో ఉద్యోగులు దాచుకున్న వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. అనేక పోరాటాలు చేస్తే 2023 సెప్టెంబర్‌లో బాకీలు తీరుస్తానని స్పష్టమైన హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ బాకీలను వెంటనే విడుదల చేయాలని, ఇప్పటికే ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈ దశలవారీ పోరాటంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యకలాపాల రిపోర్టును యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం ప్రవేశపెట్టారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ధర్నాలో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్ జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, జి.రామకృష్ణంరాజు, కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, ఎం.శ్రీనుబాబు, కెఎస్‌సిహెచ్.సాయిరాం, సిహెచ్ కుమార్ బాబ్జి పాల్గొన్నారు.

20న మొగల్తూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో షుగర్ వ్యాధి గ్రస్తుల కోసం మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని భీమవారానికి చెందిన ఇంపీరియల్ హాస్పిటల్ వైద్యులు రాయసం నరేష్ అన్నారు. మొగల్తూరులో ది ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషియనర్ అసోసియేషన్ మొగల్తూరు అధ్యక్షులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన కేంద్ర మాజీ మంత్రి ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ ఆధ్వర్యంలో మొగల్తూరులోని అందే బాపన్న, కోట్ల వెంకట రంగారావు డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో విదేశాల్లో స్థిరపడిన పలువురు వైద్యులు షుగర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి అత్యంత ఖరీదైన శస్త్రచికిత్సలు, ఉచితంగా మందులు కూడా అందించనున్నామన్నారు. ఈ శిబిరాన్ని కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి పర్యవేక్షణలో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్మ హాస్పిటల్ పిఆర్ఒ రవి, చింతపల్లి రవి, సత్యనారాయణ, జి.శ్రీనివాస్ రామకృష్ణ, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేన గౌరవ సలహాదారులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

కాపు సంక్షేమ సేన గౌరవ సలహాదారులుగా రాయలసీమకు చెందిన ఆమంచి శ్రీనివాసరావును నియమించినట్లు కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరరామజోగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన జనరల్ బాడీ సమావేశం నిర్ణయం ప్రకారం ఆయనను రాయలసీమ నాలుగు జిల్లాల కో-ఆర్డినేటర్‌గా కూడా నియమించినట్లు తెలిపారు.

నేడు ఆటో కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - మొగల్తూరు

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆటో కార్మికులు కోరారు. ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల పాటు ఆటో రవాణాను నిలుపుదల చేయనున్నామని మొగల్తూరు స్నేహ ఆటో యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం కరపత్రాలను ప్రదర్శించారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికలతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.